క్లుప్తంగా

పేరెంట్స్ కమిటీ సమావేశం తప్పనిసరి

కడియం: అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు ఈ నెల 26, 27 తేదీల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఎంఈవో వి.లజపతి రాయ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశాల్లో గత ఐదేళ్లగా ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాల గురించి సభ్యులకు తెలియజేయాలన్నారు. అమ్మ ఒడి, నాడు నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లిషు మీడియంలో బోధన, వియలవ్ రీడింగ్, లెర్న్ ఏ వర్డ్ ఏ డే, క్లాస్ రూమ్ బేస్ అసెస్మెంట్ తదితర పథకాలను గురించి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చైతన్య పరచాలన్నారు.

ఊరి బడిలో విద్యార్థులను చేర్చుదాం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులో యూటీఎఫ్ కార్యకర్తలు అందరూ ముందుండి బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించి వారి బంగారు భవితకు సహకరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ కోరారు . ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్కేవీటీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఎంఈవో 2 పదోన్నతులపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, గౌరవాధ్యక్షుడు శంకరుడు పాల్గొన్నారు.

నూకాలమ్మకు బోనాలు



నూకాలమ్మ తల్లి గుడికి బోనాలతో వచ్చిన మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఫీషియల్‌కాలనీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధివినాయక మందిరం నుంచి సమరసత సేవా ఫౌండేషన్, మహిళా ధార్మిక సభ్యులు గ్రామంలోని మహిళలు అందరితో కలిసి ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా నూకాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు. దేశం, రాష్ట్రం, గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతను ప్రార్థిస్తూ ఈ బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక సెల్ నుంచి యానావు ఏసు, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ నాగమణి, నగర మహిళా కన్వీనర్ కమల కుమారి, ధార్మిక జట్టు సభ్యులు శ్రీలక్ష్మి, దేవి, భవాని, రాధారాణి, సమరసత సేవా ఫౌండేషన్ నగర ప్రచారక్ సూరిబాబు, నూకాలమ్మ గుడి ధర్మకర్త యామన రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోళ్లబాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా తమ పాలక వర్గం పనిచేస్తోందని ది ఇన్నీసు పేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు(బాబు) అన్నారు. ఆదివారం స్థానిక బొమ్మన రామచంద్రరావు చాంబర్ ట్రస్ట్ కల్యాణ మంటపంలో బ్యాంకు సీఈవో పాలకోడేటి రమణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే వడ్డీ శాతాన్ని పెంచే విషయమై పునరాలోచన చేస్తామని చెప్పారు. వారం లోపు బ్యాంకు ఉద్యోగుల వేతన ఒప్పందాన్ని ఖరారు చేస్తామని వెల్లడించారు. ఇటీవల మృతి చెందిన బ్యాంకు మాజీ చైర్మన్ నెక్కల అప్పారావు మృతికి సమావేశం సంతాపం తెలిపింది. పాలకమండలి వైస్ చైర్మన్ గేడి పోతురాజు, డైరెక్టర్లు ఆదిరెడ్డి శ్రీనివాసరావు, అందనాపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వాష్‌రూమ్‌కు వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లిన తన కుమార్తె ఇప్పటి వరకు తిరిగి రాలేదని శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన సింగంపల్లిరమణమ్మ ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన 16 ఏళ్ల సింగపల్లి సర్వలక్ష్మి శనివారం పిన్నితో కలిసి గాదాలమ్మనగర్ ఇళ్లలోని పనికి వెళ్లింది. సర్వలక్ష్మి పిన్నితో వాష్‌రూమ్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో తన చెల్లెలు తనకు ఫోన్‌చేసి చేసిందని, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ కనిపించలేదని రమణమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్లు వెలవెల



కొనుగోలుదారులు లేక నిర్మానుష్యంగా మారిన మెయిన్‌రోడ్డు



ఖాళీగా ఉన్న షాపులు

- పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు రెండు మాసాలు విరామం
- బంగారం, దుస్తులు ఇతర వస్తువుల అమ్మకాలపై ప్రభావం

ప్రకాశం నగర్ : ఆషాఢ మాసం కావడంతో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ప్రధాన మార్కెట్‌లు కొనుగోలుదారులు రాక వెలవెలబోతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం శూన్యమాసంగా పరిగణించే ఆషాఢ మాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు ఉండవు. ఐతే ఈ ఏడాది ఆషాఢ మాసంతో పాటు అధిక శ్రావణ మాసం ఉంది. దీంతో జూన్ 19 నుంచి జూలై 17 వరకు ఆషాఢ మాసం ఉండడం, ఆ మరుసటి రోజు నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం ఉండడంతో శుభ కార్యక్రమాలు లేవు. దీంతో దుస్తులు, బంగారం, ఇతర పూజా సామగ్రి వస్తువులు, పువ్వుల దుకాణాలు, కిరాణా, ఫాన్సీ వస్తువుల అమ్మకాల పై ప్రభావం పడింది. అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. నగరంలోని ప్రధాన మార్కెట్‌లైన మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, గుండు వారి వీధి, టౌన్ హాలు రోడ్డుతో పాటు తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ వంటి ప్రధాన వ్యాపార స్థావరాల్లో ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు లేక ఆయా షాపులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

కొనుగోలుదారులకు ప్రత్యేక ఆఫర్లు

ఆషాఢ మాసంలో తమ అమ్మకాలను పెంచుకునేందుకు కార్పొరేట్ వ్యాపార సంస్థలు కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నాయి. భారీ డిస్కౌంట్లతో పాటు, గిఫ్ట్ కూపన్లు, లక్కీ డ్రాలో ఖరీదైన కార్లు, బంగారు నగలు, గృహోపకరణాలు వంటివి బహుమతులుగా అందజేస్తున్నారు.

ఉపాధిపై ప్రభావం

శుభకార్యాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడి ఉన్నవారి ఉపాధిపై ప్రభావం చూపుతోంది. కేటరింగ్, సప్లయి కంపెనీ, లైటింగ్, డేకరేషన్ కార్మికులు, కల్యాణ మంటపాలు, ఫంక్షన్ హాళ్లలో పనిచేసే కార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతోంది.

వ్యాపారం తగ్గుతుంది

ఈ సీజన్‌లో షామియానా వ్యాపారం అన్ని మాసాల్లో పోలిస్తే బాగా తగ్గుతుంది. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ రెండు మాసాలు షాపు అద్దె, కరెంట్ బిల్లులు వంటివి అదనపు భారంగా మారాతాయి. పెళ్లిళ్ల సీజన్‌లో మళ్లీ యథావిధిగా వ్యాపారం పుంజుకుంటుంది.

– మణికంఠ శ్రీను, షామియానా వ్యాపారి, రాజమహేంద్రవరం

ఇంటివద్దకే వైద్య పరీక్షలు

యాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జక్కంపూడి



యాప్‌ను ఆవిష్కరించిన జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు డబ్బు, సమయం ఆదా అయ్యేందుకు ఇంటివద్దకే వైద్య పరీక్షలు అందించే ఆక్సోలేట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. వైద్య పరీక్షలను సులభతరం చేసేందుకు అనువైన డిజిటల్ సేవలు అందించే విధంగా అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిర్వాహకులు రూపొందించిన ఆక్సోలేట్ యాప్‌ను ఆయన రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శేష దీప్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మౌనిక, డైరెక్టర్లు కె.సిద్ధార్థ, పి.అనిల్‌కృష్ణ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



సురేష్‌భయ్యాజీ దంపతులను సత్కరిస్తున్న సత్సంగ్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ధ్యానం చేయటం వల్ల మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కలిగి మనసు నిర్మలంగా ఉంటుందని ఏబీఎస్ఎస్ ఢిల్లీ ఆధ్యాత్మిక గురుజీ సురేష్ భయ్యాజీ అన్నారు. ఢిల్లీ అఖిల భారతీయ సంతమంత్ సత్సంగ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కాతేరులోని వెంకటాద్రి కల్యాణ మంటపంలో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు జిల్లాల నుంచి ఐదు వేల మంది సత్సంగ్ సభ్యులు కుటుంబ సభ్యులతో సురేష్ భయ్యాజీ దంపతులను దర్శించుకుని ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా సురేష్ భయ్యాజీ మాట్లాడుతూ గృహస్తుగా ఉంటూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవడంతోపాటు భగవంతుని ప్రార్థిస్తూ ముక్తిని పొందవచ్చని అన్నారు. అందరితో సామూహికంగా ధ్యానం చేయించారు. బి.వి.ప్రసాద్ , బి.వి.రమణ మూర్తిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆయా సత్సంగ్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

ఆర్డీవో చైత్రవర్షిణి



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

కడియం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి ఆదేశించారు. మండలంలోని మురమండ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతున్న తీరును ఆదివారం ఆర్డీవో పరిశీలించారు. అర్హత గల ఏ లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందకుండా ఉండకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం అమలులో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామ వలంటీర్లు నిర్వహించే సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని మండల పరిషత్ ఏవో కె.చంద్రరావు ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుజాత, వీఆర్వో గన్నెమ్మ, డీఏ కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణలో అందరూ భాగస్వాములు కావాలి

ఎంపీ భరత్



హ్యాపీ స్ట్రీట్ సందర్శించిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధి, సుందరీకరణ, హరిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. నగరంలోని జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాల పక్కన ప్రతీ ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌ను ఎంపీ భరత్‌రామ్ సందర్శించారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ హ్యాపీ స్ట్రీట్ నగరంలో యువతకు, విద్యార్థినీ విద్యార్థులకే కాకుండా అన్ని వర్గాల వారికీ వారం వారం ఆటవిడుపుగా ఉంటోందన్నారు. ఈ యాంత్రిక జీవితంలో కాలంతో పాటు ఉరుకులు పరుగులు పెడుతున్న ప్రతీ ఒక్కరికీ కాస్తంత విరామం, మనసుకు ఆహ్లాదం, ఆరోగ్యం, ఉత్సాహం కలిగించేందుకు హ్యాపీ స్ట్రీట్ చక్కని వేదిక కానున్నదన్నారు. నగరాన్ని హరిత నగరంగా మార్చే మహోద్యమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు స్టాలిన్, రావిపాటి రామచంద్రరావు, గుర్రం గౌతం, ఉదయ్ రాణా పాల్గొన్నారు.

కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆంధ్రకేసరి యువజన సమితి కార్యవర్గం

ప్రకాశం నగర్ : ఆంధ్రకేసరి యువజన సమితి సంస్థల నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం స్థానిక ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సీనియర్ సభ్యులు తుమ్మిడి రాంకుమార్, కర్రి రామారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడిగా దేశిరెడ్డి బలరామ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా మాదిరాజు శ్రీనివాస్, డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా షేక్ అసదుల్లా అహ్మద్, కార్యదర్శిగా సీతారామంజనేయులు, జూనియర్ కళాశాల అధ్యక్షుడిగా జెట్టి ప్రసాదరావు, కార్యదర్శిగా కె.రమేష్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడిగా క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా కోసూరి చండీప్రియ, సరస్వతి మందిరం అధ్యక్షురాలిగా కె.అనురాధ, కార్యదర్శిగా నయాన లక్ష్మారెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుల భవనానికి అధ్యక్షుడిగా ఎల్.నరసింహరెడ్డి, కార్యదర్శిగా పురంశెట్టి ప్రసాద్‌నాయుడు, ఆంధ్రకేసరి చీఫ్ అడ్వయిజరీ కమిటీ గౌరవ సభ్యులుగా దాట్ల బుచ్చి వెంకట పతిరాజు, డాక్టర్ కర్రి రామారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆంధ్రకేసరి సంస్థలు, కళాశాలల అభివృద్ధి కమిటీ కౌన్సిల్ చైర్మన్‌గా తుమ్మిడి రాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా జక్కంపూడి విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు.

300 గ్రాముల బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ఒక ఇంటిలో 300 గ్రాముల బంగారం చోరీకి గురైన ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈ నెల 24 రాత్రి వి.శ్రీనివాస్ తన ఇంటిలోని ఒక గదిలో పడుకున్నాడు. మర్నాడు ఉదయం లేచి చూసేసరికి పక్క గదిలో బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. అందులో బంగారు ఆభరణాలు మాయం అయ్యాయి. దీంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు సారా బట్టీలపై దాడులు

రాజానగరం: రఘునాథపురం, భూపాలపట్నం, శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నంలలో నాటుసారా బట్టీలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించి, 5,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీదారులపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని, సారా వ్యాపారాలు మాని స్వచ్ఛందంగా ముందుకు వస్తే, జీవనోపాధి మార్గాలు చూపిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సీ ఎం.రాంబాబు తెలిపారు.

అపూర్వ కలయిక



40 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక శ్రీ కందుకూరి వీరేశలింగం ఆస్తిక జూనియర్ కళాశాలలో 1980–82 సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదివిన విద్యార్థులు రాజమహేంద్రవరంలోని ఒక హోటల్ వేదికగా ఆదివారం కలిశారు. సుమారు నాలుగు దశాబ్దాల తరువాత ఆనందోత్సాహాలు పంచుకున్నారు. వీరంతా రాజకీయ, వ్యాపార, ఉద్యోగాల్లో దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. ఒకచోట చేరి అలనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కలయికకు నల్లమిల్లి మధుసూదనరెడ్డి, యర్రా వేణు గోపాలరాయుడు కీలకపాత్ర పోషించారు. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్ననాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాటలు, పద్యాలు పాడి ఉత్సాహంగా గడిపారు.

ఎస్సీల వర్గీకరణే మాదిగల అంతిమ లక్ష్యం

సీతానగరం: ఎస్సీల వర్గీకరణే మాదిగల అంతిమ లక్ష్యమని ఆ సంఘం కోస్తా ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు అన్నారు. ఆదివారం సీతానగరంలో విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ కార్యాచరణలో భాగంగా జిల్లా, నియోజకవర్గ, మండలాల వ్యాప్తంగా మహాజన సోషలిస్టు పార్టీ నిర్మాణానికి నాయకత్వాన్ని బలపరిచేందుకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సీతానగరం మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా మనెల్లి సుధీర్‌కుమార్‌ను ఎంపిక చేశామన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారందరూ గ్రామాలలో నూతన కమిటీల ఏర్పాటుకు కన్వీనర్‌కు సహకరించాలని సూచించారు. వచ్చే నెలలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖండవల్లి సత్తిబాబు, కత్తి సోమరాజు, మన్నెల్లి మదు, చిడిపి డార్విన్, పోలిన రాజేష్, నారే చందు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ వారి ఆదాయం రూ.1.75 లక్షలు

నిడదవోలు రూరల్: ఆషాఢ మాసం కావడంతో మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోట సత్తెమ్మ వారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ వారికి విశేష పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,75,151 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) పేర్కొన్నారు.

నిడదవోలు రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ నుంచి అవార్డులు స్వీకరించిన శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు

నిడదవోలు: సామాజిక సేవలో గుర్తింపు పొందిన రోటరీ క్లబ్ నిడదవోలు శాఖకు అవార్డుల పంట పండింది. విజయనగరంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన రోటరీ అవార్డుల ప్రదానోత్సవంలో రోటరీ– 3020 డిస్ట్రిక్ట్ స్థాయిలో నిడదవోలు క్లబ్‌కు ఉత్తమ క్లబ్‌తో పాటు వివిధ విభాగాల్లో అవార్డులు లభించాయి. రోటరీ– 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కర్ రామ్ ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎండీ ఫయాజ్, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్రప్రసాద్, ఆకుల ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లు సిద్ధం

- గ్రామీణ యువతకు ఉచితంగా అందుబాటులోకి..
- బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నంలో నేడు ప్రారంభం



బూరుగుపూడిలో అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన ఓపెన్ జిమ్



శ్రీరంగపట్నంలో వ్యాయామశాల

మధురపూడి: గ్రామీణ ప్రాంతాల్లో యువతలో ఫిట్‌నెస్ పెంచాలన్న లక్ష్యంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణాల్లో డబ్బులు వెచ్చించి ఫిట్‌నెస్‌కు శ్రమిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం యువతను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి వీటిని ఏర్పాటు చేసింది. కోరుకొండ మండలం బూరుగుపూడి, శ్రీరంగపట్నం, గాదరాడ గ్రామాల్లో ఒక్కోటి రూ.20.30 లక్షలతో ఈ ఫిట్‌నెస్ సెంటర్లను అన్ని హంగులతో నిర్మించారు. రుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వ్యాయామశాలలను సోమవారం రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభిస్తారు. ఈ వ్యాయామశాలలకు పంచాయతీ శాఖ స్థలాలను అందించింది. అయితే వీటి నిర్మాణం, వ్యాయామ పరికరాల ఏర్పాటు, శాలలను ఆహ్లాదంగా తీర్చిదిద్దే పని రుడా చేపట్టింది. ఓపెన్ జిమ్‌లను ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా నిర్వహిస్తారు.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ

యువతలో ఫిట్‌నెస్ పెంచడానికి ఏర్పాటు చేసిన ఈ వ్యాయామ శాలలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతంలోని యువత ఆ సమయాల్లో వ్యాయామాన్ని చేసుకునేందుకు అనువుగా తీర్చిదిద్దారు.

10 రకాల వ్యాయామ పరికరాలు

ఈ వ్యాయామశాలల్లో 10 రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. శరీరంలోని అన్ని భాగాలు కదిలేందుకు అనువైన పరికరాలు ఉన్నాయి. శాలలో 10 సీట్లతో వ్యాయామం చేసుకోవచ్చు. ఇక్కడ స్కై వాకర్, డబుల ఎయిర్ వాకర్‌తో మంచి వ్యాయామం చేసుకోవచ్చు. థాయ్‌చి స్పిన్నర్ 4 వీల్ ద్వారా దేహదారుఢ్యాన్ని సాధించవచ్చు. సీటెడ్ పుల్లర్ డబుల్ పరికరం ద్వారా కూర్చుని వ్యాయామాన్ని చేయవచ్చు. దీంతో కాళ్లు, నడుము పై భాగంలో వ్యాయామం జరుగుతుంది. హార్స్ రైడర్ ద్వారా మంచి శక్తిని పొందవచ్చు.

యువతను ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి



యువతను ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి బహిరంగ వ్యాయామ శాలలను ఏర్పాటు చేశాం. శాలలకు చుట్టూ పటిష్టమైన గోడ నిర్మించి, రంగులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరిక మేరకు రాజానగరం నియోజకవర్గంలోని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశాం.

– మేడపాటి షర్మిలారెడ్డి, చైర్మన్, రుడా, రాజమహేంద్రవరం

డబ్బు చెల్లించలేని వారికోసం



ఆసక్తి ఉన్నప్పటికీ యువత డబ్బు చెల్లించలేక, వ్యాయామ శాలలకు వెళ్లలేకపోతున్నారు. వారికి బహిరంగ వ్యాయామ శాలలు ఉపయోగపడతాయి. వీరంతా రోడ్లపై వాకింగ్ చేస్తున్నారు. వాకర్స్ కూడా దీన్ని ఉపయోగించుకోవాలి. వాకింగ్‌కు సంబంధించిన పరికరాలు ఉన్నాయి. ఇవి పెద్దవారికి ఉపయోగపడతాయి. వీటి నిర్మాణంలో రుడా సహకరించింది.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం